# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 5, డిసెంబర్ 2025




సింగరేణికి రాజస్థాన్ కేబినెట్



# గ్రీన్ సిగ్నల్..

- ✦ 2300 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులకు ఆమోదం
- ✦ ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టితో భేటీ అయిన రాజస్థాన్ విద్యుత్ మంత్రి హీరాలాల్ నగర్
- ✦ రూపుదిద్దుకోనున్న 1500 మెగావాట్ల సోలార్, 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లు
- ✦ తొలిసారిగా ఇతర రాష్ట్రానికి సింగరేణి విస్తరణ

– నస్పూర్/జైపూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త

2 లో..

# ఆదిలాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..



- ❖ తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తాం
- ❖ 700 ఎకరాలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు చర్యలు
- ❖ కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేసేందుకు కృషి
- ❖ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



అదిలాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త

ఆదిలాబాద్ జిల్లాను వ్యాపార కేంద్రంగా, వ్యవసాయ క్షేత్రంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన విజయోత్సవ సభలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం

మిగతా 2లో..




## నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్


జైపూర్, డిసెంబర్ 04, ప్రభాతవార్త



నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భీమారం మండలంలో భీమారం, పోలంపల్లి, ఆరేపల్లి గ్రామాలకు భీమారం గ్రామపంచాయతీ, బూర్గుపల్లి, నర్సింగాపూర్ (బి) గ్రామాలకు బూర్గుపల్లి గ్రామపంచాయతీ, దాంపూర్, ధర్మారం, కాజిపల్లి గ్రామపంచాయతీ లలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, సి.ఐ. నవీన్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని అన్నారు. రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాలో పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని మిగతా 2లో..

## పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:



స్థానిక సంస్థల ఎన్నికలలో పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల కమిషన్ సభ్యులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, జిల్లా మిగతా 2లో..



# ఆదిలాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

(మొదటిపేజీ తరువాయి)

నగేష్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదిలాబాద్ పట్టణంలోరూ.260.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.రూ.18.70 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం శంకుస్థాపన,రూ.1.75 కోట్ల పెట్టుబడితో ఇందిరా మహిళా శక్తి క్రింద స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్ స్థాపనకు శంకుస్థాపన,రూ.19.69 కోట్లుతో 160 స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు,రూ.200 కోట్లతో పట్టణ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన,2 కోట్లతో మహాలక్ష్మి ్మ వాడ, విద్యానగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం ఆధునికీకరణకు శంకుస్థాపన. పట్టణ భద్రతను మరింత బలోపేతం చేసి, శాంతి-భద్రతల పరిరక్షణను అత్యున్నత స్థాయిలో కొనసాగించడానికి రూ.11.93 కోట్లతో 18 పోలీస్ క్వార్టర్స్, 2.6 కోట్లుతో 3 ఇంటెలిజెన్స్ విభాగం క్వార్టర్స్, 2 కోట్లతో భరోసా కేంద్రం ప్రారంభ కార్యక్రమం.పట్టణ అభివృద్ధికి, పరిశ్రమల పురోగతికి, ప్రజల దైనందిన జీవన విధానానికి అత్యంత కీలకమైన అంశం స్థిరమైన, నిరంతర విద్యుత్ సరఫరా, ఆదిలాబాద్ ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న రూ. 231.24 లక్షల నిధులతో కొత్త కలెక్టరేట్ సమీపం వద్ద టీజీ ఎన్పీడీసీఎల్ ద్వారా 33/11 కె.వి సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంఖు స్థాపన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాలుగు కోట్ల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పేద ప్రజల ఆశీస్సులతో ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, త్వరలో హైదరాబాద్ లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతిపక్షాలను సైతం కలుపుకుని ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 700 ఎకరాలలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో భూసేకరణకు జీవో జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఎయిర్ పోర్ట్ కొరకు భూమి కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వం అవసరమైన అనుమతులు, నిధులు మంజూరు చేసేందుకు అంగీకరించిందని, సంవత్సరం లోగా ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ పనులను ప్రారంభించి ఎయిర్ బస్సులను నడిపిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుందని, కొమురం భీమ్, రాంజీ గోండు స్ఫూర్తితో ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించడమే కాకుండా అమరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి, నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాబోవు 2 నెలలలో ప్రత్యేకమైన ప్రణాళికలు తీసుకొని ఇక్కడికే వచ్చి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నెలకొన్న సమస్యలపై అధికారులను, ప్రజా ప్రతినిధులను ఒకచోట చేర్చి నివేదికలు స్వీకరించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో తుమ్మిడిహెట్టి, చేవెళ్ల వరకు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 38 వేల 500 కోట్ల రూపాయలతో ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అంచనా కొరకు టెండర్లు పిలవడం జరిగిందని, వ్యవసాయ భూములకు గోదావరి నీటి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని అపారమైన సున్నపు గనులను వినియోగించుకుని సిమెంటు కర్మాగారాలను నెలకొల్పి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందని, ఖమ్మంలో డాక్టర్ మన్మోహన్ సింగ్



పేరిట ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ మంజూరు చేసి పనులు ప్రారంభించామని, ఆదిలాబాద్ లో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి రోజు నుండి భర్తీ చేసేందుకు కృషి చేసి 61 వేల మంది నిరుద్యోగులకు ఎల్.బి. స్టేడియంలో ప్రజల సాక్షి గా నియామక పత్రాలను అందించడం జరిగిందని తెలిపారు. పారదర్శకంగా పరీక్షల నిర్వహించి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. రాబోవు రోజులలో మరో 40 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని, తెలంగాణ యువత అధికారులుగా, ఉద్యోగులుగా తెలంగాణ పునర్నిర్మాణంలో పాలు పంచుకోవాలని తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించి 2 సంవత్సరాల కాలంలో 8 వేల 100 కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఆడబిడ్డలను 1 వేయి బస్సులకు యజమానులను చేసామని, సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, పెట్రోల్ బంకుల నిర్వహణకు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలలోని ఆడబిడ్డలను అన్ని వ్యాపార రంగాలలో ప్రోత్సహించి ఆర్థిక అభివృద్ధి సాధించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. మార్చి2026 నెలలో మున్సిపాలిటీలలోని మహిళలకు అందించడం జరుగుతుందని తెలిపారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసేందుకు కృషి చేస్తామని, కుటుంబ మర్యాదను నిలబెట్టే విధంగా ఆడబిడ్డలను ఇంటి యజమానులను చేశామని తెలిపారు. దేశంలోనే వరి పంట మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలబడిందని, రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తున్నామని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని తెలిపారు. చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించడం జరుగుతుందని, రాష్ట్రంలోని 3 కోట్ల 10 లక్షల మంది ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారని తెలిపారు. జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతు పేద విద్యార్థులు ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా గత సంవత్సరం పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించడం జరిగిందని, ఈ సంవత్సరం జరిగిన నష్టంపై చర్యలు తీసుకుని రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైజింగ్ తెలంగాణ 2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రజలందరి సమస్యల పరిష్కారానికి దూర దృష్టితో ప్రణాళిక రూపొందించి రాష్ట్రంలో లక్షలాది కోట్ల రూపాయల పెట్టుబడులతో పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా సామాజిక, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఆదిలాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లాలో 700 ఎకరాలలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు భూ సేకరణ జి. ఓ. జారీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో జిల్లాలోని విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా 40 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఆదిలాబాద్ నుండి కార్యక్రమాన్ని ప్రారంభించాలని, రైతులు తమ పొలాలకు వెళ్లే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. 30 సంవత్సరాలుగా జిల్లాలో మూసి ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీని నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం తెరవాలని, కోట్ చనాక ప్రాజెక్ట్ పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన భూసేకరణ పనులు పూర్తి చేస్తే దాదాపు 65 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు.రైతులను ఆదుకోవాలని, జొన్న పంటను కొనుగోలు చేయాలని కోరారు.సి ఎస్ ఆర్ నిధుల ద్వారా అదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్,కలెక్టరేట్ భవన సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్, పోలీస్ గృహ సముదాయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు.అనంతరం పట్టణ మహిళా సమాఖ్య 160 స్వయం సహాయక సంఘాలకు 19 కోట్ల 69 లక్షల 33 వేల రూపాయల బ్యాంకు రుణం చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ ప్రతినిధి పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధిక

---

### సింగరేణికి రాజస్థాన్ కేబినెట్

# గ్రీన్ సిగ్నల్..

(మొదటిపేజీ తరువాయి)

సింగరేణి సంస్థ చరిత్రలో మరో కీలక ముందడుగు పడింది. రాజస్థాన్ రాష్ట్రంలో సింగరేణి సంస్థ, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ సంయుక్తంగా చేపట్టనున్న భారీ విద్యుత్ ప్రాజెక్టులకు రాజస్థాన్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లును రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరాలాల్ నగర్ మర్యాదపూర్వకంగా కలిసి, క్యాబినెట్ ఆమోద పత్రాన్ని అందజేశారు. ఈ ఒప్పందంలో భాగంగా మొత్తం 2,300 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఇందులో 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఉన్నాయి. రెండు రాష్ట్రాల విద్యుత్ అవసరాలకు ఈ ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని, అందుకే పనులు త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో తమ క్యాబినెట్ వెంటనే ఆమోదం తెలిపిందని రాజస్థాన్ మంత్రి హీరాలాల్ నగర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణలో భాగంగా సొంత రాష్ట్రం దాటి, ఇతర రాష్ట్రమైన రాజస్థాన్‌లో ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల్లోనూ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి సన్నాహాలు చేస్తోందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో రాజస్థాన్ అధికారులు కాలూరామ్, ప్రమోద్ శర్మ, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడీ చిరంజీవి, జీఎం (కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

---

### నామినేషన్ ప్రక్రియ

# సమర్థవంతంగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించడంతో పాటు సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ అధికారులతో పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల చివరి విడత నామినేషన్ల ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. మూడు విడతలో నిర్వహించే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ ్మనారాయణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2874 వార్డు స్థానాలకు 3 విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చివరి విడత ఎన్నికల కొరకు సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో 3 విడతల ఎన్నికల కొరకు 87 జోన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని, మండల ప్రత్యేక అధికారులు, జోనల్ అధికారులు, నోడల్ అధికారులు, తహసీల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, పోలీసు శాఖల సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా పర్యవేక్షి స్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు

## శ్రీరాంపూర్ ఐటీఐలో 8న నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

### - ప్రిన్సిపల్ టి. సుజాత

**నస్పూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఆవరణలో ఈ నెల 8న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ టి. సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొని అప్రెంటిస్‌ల ఎంపిక చేపట్టనున్నాయని ఆమె పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ నందు ఉదయం 10 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా ఫామ్‌తో పాటు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకొని ఉదయం ఐటీఐ ప్రాంగణానికి చేరుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు.



## రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి బైకులు, ఆటోలు వెళ్లేందుకు వీలు కల్పించాలి

**బెల్లంపల్లి, డిసెంబర్ 04, ప్రభాతవార్త**

బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియా రైల్వే అండర్ బ్రిడ్జి బైకులు, ఆటోలు వెళ్లేందుకు వీలు కల్పించాలని గురువారం రోజున బెల్లంపల్లి రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ గోపి ను కలిసి సమస్యను గురించి పరిష్కరించేలా కృషి చేయాలని కోరిన టీపీసీసీ ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ 13వ వార్డు మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్, 12వ వార్డు మాజీ కౌన్సిలర్ నెల్లి శ్రీలత రమేష్, 10 వ వార్డు మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, మరియు కాంగ్రెస్ నాయకులు ఎంఏ సలీం. రైల్వే అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్‌కు సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించడం జరిగింది. అవసరమైతే హైదరాబాదులోని రైల్వే జీఎం ను కూడా ఎమ్మెల్యే వినోద్ వెంకట స్వామి ఆధ్వర్యంలో కలిసి సమస్యను పరిష్కరించే దిశగా వెళ్తామని తెలపడం జరిగింది. బెల్లంపల్లి పట్టణ ప్రజలందరూ ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారం కోసం ఎంత దూరమైన వెళ్లి సమస్య పరిష్కరించే దిశగా పోరాడుతామని తెలపడం జరిగింది.

## కన్నుల పండువగా మల్లన్న రథోత్సవం

**తాండూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :**

మండలంలోని గోపాల్ నగరం సమీపంలోని గుట్ట వద్ద గురువారం సాయంత్రం కుంకుమయి (గుట్ట) మల్లన్న రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. రేచీనిలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయం వద్ద రథానికి పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. ఒగ్గు కళాకారుల డోలు, వాయిధ్యాల మధ్య మహిళలు బతుకమ్మ ఆడుతూ, సాంప్రదాయ నృత్యాలు చేస్తూ నగరం గుట్ట వరకు రథాన్ని ఊరేగింపుగా లాగుతూ తీసుకొచ్చారు. పుట్ట వద్ద మహిళలు, భక్తులు మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేసి రథాన్ని పోటీపడి లాగారు. మల్లన్న గుట్ట వద్ద మార్గశిర మాసంలో భక్తులు, మహిళలు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి మార్గశిర మాసంలో వచ్చే ప్రతి ఆదివారం, మంగళవారం, బుధవారాలలో బోనాలు పోసుకొని మొక్కులు చెల్లించుకుంటారు. మార్గశిర పౌర్ణమినాడు మల్లన్న రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రథోత్సవం అనంతరం అన్నదానం నిర్వహించారు.



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న మహిళలు, భక్తులు

# ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు పని చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



పాల్గొన్న ఆయాశాఖల అధికారులు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:**

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా అధికారులు పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణపై మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు 3 విడతలుగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు, 2874 వార్డు స్థానాలకు 3 విడతలలో 87 జోన్ లుగా ఏర్పాటు చేయడం జరిగిందని, జోనల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి రూట్ మ్యాప్, పోలింగ్ కేంద్రాలలో వసతులు, నెట్ వర్క్ పై నివేదికలను ఈ నెల 5 లోగా సమర్పించాలని తెలిపారు. మొదటి విడత ఎన్నికలలో భాగంగా ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలకు రిపోర్టు చేసిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు వారికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల ఎన్నికల సామాగ్రి అందజేసి వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ చేపట్టాలని, ఫలితాలు వెలువరించి ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించి తిరిగి సిబ్బందిని స్వీకరణ కేంద్రాలకు తీసుకువచ్చే వరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పన, భోజన ఏర్పాట్లు చూడాలని తెలిపారు. నోడల్ అధికారులు ఎన్నికల సామాగ్రి సిబ్బందికి శిక్షణ, వాహనాల ఏర్పాట్లు పర్యవేక్షించి జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మార్కెట్ వ్యాపార కమిటీ ఎలక్షన్స్ మళ్ళీ వాయిదా

### - డిసెంబర్ 12,13 నామినేషన్, డిసెంబర్ 18 ఎలక్షన్స్, రిజల్ట్

**మందమర్రి, డిసెంబర్ 4, ప్రభాతవార్త**

మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. గత ఏడాది కాలంగా ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న మందమర్రి వ్యాపార కమిటీ ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ ఎన్నికలు వరుసగా వాయిదాలు పడుతుండటంతో, "ఈసారైనా వ్యాపార క్షేమ ఎలక్షన్స్ జరిగేనా..?" అంటూ వ్యాపారవేత్తలలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత సంవత్సరం నుండి కొనసాగుతున్న ఎన్నికల తేదీల మార్పులు, ఇటీవల డిసెంబర్ 10న జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడటంతో వ్యాపారస్తుల్లో అసంతృప్తి నెలకొంది. మార్కెట్ వ్యాపార కమిటీ ఎన్నికలు డిసెంబర్ 10న జరగాల్సిన ఈ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు డిసెంబర్ 18కి వాయిదా వేయబడ్డాయి. మందమర్రి మార్కెట్ ఎన్నికలు ఇదివరకు నిర్ణయించిన తేదీలలో కాకుండా, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ఆదేశాల ప్రకారం ఒక వారం రోజులపాటు వాయిదా వేయడం గవర్నింగ్ బాడీ నిర్ణయించారు. ఎన్నికల కమిషన్ కొత్తగా ప్రకటించిన ఎలక్షన్ ప్రక్రియ తేదీలు వివరంగా ఎన్నికల షెడ్యూల్: నామినేషన్ల స్వీకరణ: డిసెంబర్ 12, 3 తేదీలు, నామినేషన్ల నిష్క్రమణ: 14వ తేదీ, ప్రచార పర్వం: 15, 16, 17 తేదీలు, ఎన్నికల నిర్వహణ: 18వ తేదీ, రిజల్ట్. వ్యాపార కమిటీ ఎలక్షన్స్ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించబడుతుంది. తదుపరి మధ్యాహ్నం 2 - 3 భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభం. సాయంత్రం 5 గంటలకు గెలిచిన అభ్యర్థికి గెలుపు పత్రం ప్రదానం. అందువల్ల మార్కెట్ వ్యాపార మిత్రులు గమనించగలరనీ ఎలక్షన్ కమిటీ సభ్యులు, గవర్నర్ బాడీ వ్యాపారస్తులకు తెలియజేశారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్

## బాల్య వివాహాల నిషేధ చట్టం ద్వారా ప్రభుత్వం కఠినమైన శిక్షలు విధిస్తోంది

**ఆసిఫాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త:**

బాల్య వివాహాల నిషేధ చట్టం ద్వారా ప్రభుత్వం కఠినమైన శిక్షలు విధిస్తోందని జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, షూస్ స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో రూపొందించిన వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూజిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహం సమాజానికి మచ్చ వంటిదని, ఇది బాలల శారీరక, మానసిక, విద్యా భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రజలకు చేరువ చేసేందుకే అవగాహన బోర్డులను జిల్లాలోని ప్రతి దేవాలయం, మసీదు, చర్చి వంటి ప్రార్థనా స్థలాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలల ఈ బోర్డుల ద్వారా బాల్య వివాహాల నిషేధ చట్టం, ఫిర్యాదు చేసే విధానం, శిక్షల వివరాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కలుగుతుందని అన్నారు. జిల్లా సంరక్షణ అధికారి మహేష్ మాట్లాడుతూ షూస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాల రక్ష భవన్ సిబ్బంది శ్రావణ్ కుమార్, బాల ప్రవీణ్ కుమార్, నవీన్ కుమార్, వెంకటేశ్వర్లు, షూస్ సంస్థ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్, దేవాజి, ప్రభు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జీరో పెండెన్సీ లక్ష్యంగా ప్రయాస్..

**- శ్రీరాంపూర్ ఏరియాకు 1332 రివైజ్డ్ పీపీఓలు - సీఎంపీఎఫ్ అధికారులు మా వద్దకు రావడం శుభపరిణామం**

**- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త**

పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించి, జీరో పెండెన్సీ సాధించడమే లక్ష్యంగా శ్రీరాంపూర్ ఏరియాలో ప్రయాస్ 4 సమావేశం జరిగింది. గురువారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్2 గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రీజనల్ కమిషనర్ గోవర్ధన్, శ్రీరాంపూర్ ఏరియాకు సంబంధించిన 1332 రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ (పీపీఓ) కాపీలను జీఎం మునిగంటి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్మెంట్ల కోసం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన సీ-కేర్స్ విధానంలో పెండింగ్ దరఖాస్తులను జీరో స్థాయికి తేవడమే జప్రయాస్‌చ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఏరియా పరిధిలోని పెండింగ్ క్లెయిమ్స్‌ను సమీక్షించి, వాటిలో ఉన్న లోపాలను సవరించి వెంటనే పరిష్కరించాలని సంక్షేమ అధికారులకు సూచించారు. జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం చాలా జటిలంగా ఉండేదని, అధికారులను సంప్రదించడం కూడా క్లిష్టంగా ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం సీఎంపీఎఫ్ అధికారులే నేరుగా మన వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరించడం శుభపరిణామం అని కొనియాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సంక్షేమ అధికారులు, సిబ్బంది రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. రానున్న రోజుల్లోనూ జీరో పెండెన్సీ లక్ష్యంగా మరిన్ని ప్రయాస్ మీటింగ్‌లు నిర్వహిస్తామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కె బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, సీనియర్ పీఓ సురేందర్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి సందీప్, వివిధ గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రివైజ్డ్ పీపీఓలు అందజేస్తున్న దృశ్యం




రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపి

## రోశయ్య గారి రాజనీతి భావితరాలకు స్ఫూర్తి

**- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**మంచిర్యాల, డిసెంబర్ 4, ప్రభాతవార్త**

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రజాసేవకుడిగా దీర్ఘకాలం సేవలందించిన కొణిజెటి రోశయ్య వర్ధంతి సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పోలీసు అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రోశయ్య రాజకీయ ప్రస్థానం, నిస్వార్థ ప్రజాసేవ, సాదాసీదా జీవన పద్ధతి, పరిపాలనా నైపుణ్యం వంటి అంశాలను స్మరించుకున్నారని, ప్రజలకు అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. సమాజ సేవలో, ప్రజా సంక్షేమంలో రాజకీయ నాయకులు చూపాల్సిన నైతిక విలువలు, పారదర్శకత, వినయశీలత ఆయన వ్యక్తిత్వంలో అభివృద్ధి చెందిన కీలక లక్షణాలు అని సీపీ గుర్తు చేశారు. కొణిజేటి రోశయ్య నిరంతనం ప్రజాసేవలో నిమగ్నమయ్యారని, మహనీయులు ఆశలను సాధించేందుకు ప్రతి ఒక్కరి తమవంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఎఓ శ్రీనివాస్, వివిధ వింగ్స్ ఇన్స్పెక్టర్‌లు, ఆర్ఐలు, సీపీఓ సిబ్బంది, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.



## వైభవంగా దత్త జయంతి వేడుకలు

**సారంగాపూర్, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**

మండలంలోని ప్యారామూర్, కౌట్ల(బి) గ్రామాలలో దత్త జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్యారామూరులో ముందు రోజు నుంచి పారాయణ చేశారు. గురువారం ఉదయం నుంచి మహారాజ్ ఆలయంలో ప్రత్యేకమైనటువంటి పూజలు నిర్వహించి ఆ తర్వాత ఉట్టి కుండను కొట్టి ప్రసాదాన్ని అందరికీ పంచారు. కౌట్ల(బి) గ్రామంలో ఆలయ పరిసర ప్రదేశాలలో జెండాలు ఎగరవేసి గ్రామంలోని వీధుల గుండా పల్లకి సేవను నిర్వర్తించారు. అనంతరం ఈరు గ్రామాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు చుట్టుపక్కల ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 04, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని శ్రీ దత్త సంస్థానంలో అఖండ దత్త జన్మ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ దత్త నామ స్మరణం నవంబర్ 27 నుండి సాగి రేపటితో ముగియనుంది. గురువారం ఉదయం దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో ఉత్సవం సాగింది. దత్త మంత్ర హోమం, శ్రీపాదవల్లభుల దివ్యపాదపద్మములకు వివిధ హారతులతో, స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. తదనంతరం భక్తులు అన్నదాన మహా ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం దత్తాత్రేయస్వామి యొక్క మహా పూజ కార్యక్రమం నిర్వహిస్తారు.



## ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు శుభాకాంక్షలు వెల్లువ

**తాండూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :**

ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయానికి మండల నాయకులు వెళ్లి ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, నాయకులు పుట్ట శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, కాపర్తి సుభాష్, పలురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే వినోద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

## జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన తిర్యాని విద్యార్థిని

**తిర్యాని, డిసెంబర్ 4, ప్రభాతవార్త;**



తిర్యాని మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మేంద్రపు హర్షిత జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి గ్రామానికి చెందిన మేంద్రపు హర్షిత ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల గురుకులం పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ఆ పాఠశాల నుండి రాష్ట్రస్థాయి అండర్ 17 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై గతనెలలో నల్గొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా జట్టులో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచి మొదటి స్థానం సంపాదించింది. ఈ నెల 16 నుండి 23వ తేది వరకు ఝార్ఖండ్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొననుంది. కాగా ఈ పోటీల్లో కూడా ఉత్తమ ప్రదర్శన కనబరిచి మారుమూల మండలమయిన తిర్యానికి మంచి గుర్తింపును తీసుకుని రావాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆసిఫాబాద్ గురుకులం బాలికల పాఠశాలలో విద్యార్థినీలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు

## భక్తి శ్రద్ధలతో శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 4, ప్రభాతవార్త**

శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక సాయిబాబా ఆలయంలో జయంతిని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు ఇందారపు మధుకర్ శర్మ, అర్చకుడు ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో సాయి బాబా, దత్తాత్రేయ, గణపతి విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు అనంతరం గీతా పారాయణం, హోమం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టారు. సాయిబాబా పల్లకి సేవ నిర్వహించి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని నలుమూల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కలు చెల్లించారు.

## నిర్మల్‌లో పోలీస్ గృహ సముదాయాల ప్రారంభోత్సవం

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ గృహ సముదాయాల భవనాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డితో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భవన సముదాయాలను ప్రారంభించారు. అనంతరం భవన సముదాయాలని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కలెక్టర్ అభిలాష్ అభినవ్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ రాజేష్ మీనన్ పోలీస్ ఉన్నతాధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

## సిఐటియు రాష్ట్ర మహాసభ పోస్టర్లు విడుదల

**తాండూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబిలో గురువారం సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఐదవ మాసభ పోస్టర్లలను నాయకులు విడుదల చేశారు. సిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ డిసెంబర్ 7,8,9, తేదీలలో మెదక్ జిల్లా కేంద్రంలో మహాసభలు జరుగుతాయన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రామయ్య సిఐటి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి రాఘవులు మహాసభకు ముఖ్య అతిథులు హాజరవుతారని తెలిపారు. మహాసభలకు నాయకులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు దేవదాస్, అంగన్వాడి టీచర్లు లీలారాణి, విజయలక్ష్మి, వరలక్ష్మి, హనుమక్క, కమల, కమల, రాధా, మల్లక్క, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్గం గ్రామంలో బిఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

## కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**పెంచికల్ పేట్, డిసెంబర్ 04, ప్రభాతవార్త**

మండలంలోని కమ్మర్గం గ్రామ పంచాయతిలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పోర్తెటి కళావతి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల బిఆర్ఎస్ చేస్తున్న సేవలను చూసి స్వచ్ఛందంగా ప్రజలు పార్టీలోకి వస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు చౌదరి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కటుకం మధూకర్ చేస్తున్న కృషి అభినందనీయం

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 4, ప్రభాతవార్త :**

సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధితో పాటు కృషి అభినందనీయమని కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. ఇటీవల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన కటుకం మధూకర్‌ను కాగజ్‌నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, సిహెచ్ ప్రసాద్ జిహెచ్ఎం ఆశ్రమ పాఠశాల కాగజ్‌నగర్, డి. సత్యనారాయణ జిహెచ్ఎం జెడ్పిహెచ్ఎస్ బాబాసాగర్, వెంకట్రావుపేట డి. లింగారెడ్డి పిఎస్ హెచ్ఎంలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సేవాభావం, పాఠశాల అభివృద్ధి పట్ల నిబద్ధత, విద్యార్థుల శ్రేయస్సు కోసం కటుకం మధూకర్ తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాంప్లెక్స్ హెచ్ఎం మధూకర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ,హెచ్ఎంలు

# ఎస్సైని, ఎన్నికల అధికారి ఆర్ఓని విధుల నుంచి వెంటనే తొలగించాలి

### - మంచిర్యాల మాజీ శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు

**మంచిర్యాల, డిసెంబర్ 4, ప్రభాతవార్త**

ఎమ్మెల్యే అండదండలతో అతి ఉత్సాహం ప్రదర్శించి, విత్ డ్రా సమయం ముగిసిన తర్వాత టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేయడానికి సహకరించి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన దండేపల్లి ఎస్సైని, ఎన్నికల అధికారి ఆర్ఓని వెంటనే విధుల నుండి తొలగించాలని, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని దివాకర్ రావు నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి మాధవిని, కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతో, ప్రోత్సాహంతో దండేపల్లి మండల ఎస్.ఐ ఎన్నికల ఉపసంహరణ సమయం 3:00 సాయత్రం ముగిసిన తర్వాత 4:20 ని.లకు ఎన్నికల కార్యాలయం లోని వెనక డోర్ తీసి మాధవిని, వేసిన నామినేషన్ ని విత్ డ్రా చేపించే ప్రయత్నం చేశారు అని అన్నారు. ఆ సమయానికి మా పార్టీ తరఫున బలపరిచిన అభ్యర్థుల విత్ డ్రా చేపించడం కొరకు ఎన్నికల సమయం ముగియడానికి ముందు నుండే లోపల ఉన్న మా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఈ విషయాన్ని గమనించి ఎస్.ఐ ని మీరు ఎన్నికల కోడ్ ని ఉల్లంఘిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు అని మా నాయకులు ప్రశ్నించగా, ఎస్ఐ మా నాయకులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా నన్ను ప్రశ్నిస్తే మీపై కేసులు నమోదు చేస్తాను, మర్యాదగా తప్పుకోండి అంటూ భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని,తెలిపారు.ఈ విషయంపై మేము మంచిర్యాల జిల్లా కలెక్టర్ కి 4:38 ని.లకు ఫోన్ చేసి మాట్లాడగా, వారు నాకు చెప్పిన మాట మూడు గంటల లోని వారు విత్ డ్రా కి వచ్చారని మళ్లీ వెరిఫికేషన్ కోసం పిలిచారని నాకు మెసేజ్ ద్వారా తెలపడం జరిగిందని, తెలిపారు. మేము ప్రెస్ కి,ఎన్నికల కమిషన్ కి, అధికారులకు కంప్లైంట్ చేస్తున్నామని,దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు మా దగ్గర ఉన్నాయి అని చెప్పిన తర్వాత మళ్లీ 5:04 గం.లకు మేము కలెక్టర్ కి ఫోన్ చేయగా,ఆ నామినేషన్ విత్ డ్రా ని ఆమోదించలేదని మాకు తెలిపారు.విత్ డ్రా ఆమోదించారని మాకు సమాచారం అందిన తర్వాత కలెక్టర్ కి 7:38 ని.లకు ఫోన్ చేసి మేము అడగగా మీ అభ్యర్థి పోటీలో ఉన్నారు మీకు ఎవరో ఇలాంటి తప్పుడు సమాచారం ఇస్తున్నారు అని మాతో అన్నారని,కానీ సుమారు రాత్రి 9 గంటల ప్రాంతంలో కలెక్టర్ మాకు ఫోన్ చేసి విత్ డ్రా ఎన్నికల అధికారి ఆర్ ఓ ఆమోదించారని వారి నిర్ణయాన్ని నేను మార్చలేను కానీ విత్ డ్రా సమయం ముగిసిన తర్వాత విత్ డ్రా ఆమోదించినందుకు మేము సంబంధిత ఎన్నికల అధికారి ఆర్ ఓ పై ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తానని మాకు తెలిపారుఅధికార పార్టీకి పూర్తి మద్దతుగా నిలుస్తూ అలాగే ఎన్నికల కోడ్‌ను, ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కిన దండేపల్లి ఎస్సైని, ఎన్నికల అధికారి ఆర్ఓని వెంటనే వారి విధులనుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యులు దివాకర్‌రావు

# మోసం నర్మదమల్లేష్ (జర్నలిస్టు) దంపతుల జ్ఞాపకార్థం అన్నదానం

**బెల్లంపల్లి, డిసెంబర్ 04, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలో గురువారం రోజున జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 375వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలి తో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని, దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ రోజు 375వ సారి దాత మోసం నర్మదమల్లేష్ కుమార్ (జర్నలిస్టు) దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి మిత్రులు యాచకులకి, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో సుమారు 180 మందికి అన్నదానం చేయడం జరిగిందని, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు తోటి బెల్లంపల్లి జర్నలిస్టు మిత్రులు మరియు జనహిత సేవా సమితి కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు నిచ్చకోల గురుస్వామి, బోనాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి ఏరియాలో సీఎంపీఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

### ఉద్యోగులకు సేవల వేగవంతం కోసం చర్యలు - సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్

**మందమర్రి, డిసెంబర్ 04, ప్రభాతవార్త**




మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో, జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన సీఎంపీఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించబడింది. ఈ సమావేశంలో సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ కె. గోవర్ధన్ మాట్లాడుతూ, సీఎంపీఎఫ్ సేవలను ఉద్యోగులకు ఎలాంటి జాప్యం లేకుండా, వేగంగా అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సీ-కేర్స్ పోర్టల్ ద్వారా సీఎంపీఎఫ్, పెన్షన్‌కు సంబంధించిన అన్ని లావాదేవీలు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని వివరించారు.కొత్తగా ఖగ్రప్రయాస్గగ పద్ధతిని ప్రారంభించడంతో పెన్షన్ మరియు ఇతర క్లెయిమ్‌లు మరింత వేగంగా పూర్తి చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ లక్ష్యంతో పెన్షన్ సంబంధిత క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేస్తున్నామని చెప్పారు. మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా సేవలను పొందేలా చర్యలు చేపట్టామని, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అనంతరం జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, సీఎంపీఎఫ్ మరియు పెన్షన్‌కు సంబంధించిన సమస్యలను పూర్తిగా తొలగించేందుకు ప్రయాస్ పద్ధతి ఎంతో సహాయకారిగా మారిందని, ఈ సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్న అధికారులు మరియు సీఎంపీఎఫ్ విభాగానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.ఓ.టు జి.ఎం. జి.ఎల్. ప్రసాద్, సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ కె. గోవర్ధన్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, సీఎంపీఎఫ్ రీజినల్ కార్యాలయ సిబ్బంది, అన్ని గనుల సంక్షేమ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# రోశయ్య సేవలు చిరస్మరణీయం..

**- ఘనంగా మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి**

**- రాజకీయాల్లో ఆయనొక స్వచ్ఛమైన వ్యక్తి : మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఎన్నోసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు రోశయ్య సొంతమని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా వినూత్న సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, అనంతరం గవర్నర్‌గా కూడా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. రాజకీయాల్లో స్వచ్ఛమైన వ్యక్తిగా, మచ్చలేని నాయకుడిగా రోశయ్య గుర్తింపు పొందారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఆయన వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని, మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి



కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంత్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో పిన్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ పదివేలు ఇవ్వాలి

**- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

జైపూర్, డిసెంబర్ 04, ప్రభాత వార్త

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ పది వేల రూపాయలు ఇవ్వాలని పెద్దపల్లి ఎం.పి గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్‌లో మరోసారి సింగరేణి కార్మికుల పెన్షన్ సమస్య పై పార్లమెంట్‌లో మాట్లాడారు. గత సమావేశంలో ఇదే అంశాన్ని లేవనెత్తిన విషయం గుర్తుచేసుకుంటూ, మాజీ కార్మిక, గనుల శాఖ మంత్రి కాకా వెంకటస్వామి ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం 35 సంవత్సరాలైనా సరైన రీతిలో అప్‌డేట్ కాలేదని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు .ఇప్పటికీ పెన్షన్ 500 నుండి 1000 మధ్యే ఉండడం తీవ్రమైన అన్యాయం అని పేర్కొంటూ, గతంలో సీఎంపీఎఫ్‌కి టన్నుకు రూ. 20 కేటాయించినప్పటికీ పెన్షన్ రివిజన్ అమలు కాలేదని తెలిపారు. ప్రస్తుత జీవన వ్యయం రూ.8000-రూ.10,000 వరకు పెరిగిన నేపథ్యంలో కనీసం రూ. 10,000 పెన్షన్ ఇవ్వడం అత్యవసరమని ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులు కోర్టులో కేసు వేసి న్యాయం కోసం పోరాడుతున్న విషయాన్ని కూడా ఆయన వివరించారు .సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సరైన న్యాయం చేయాలని, సీఎంపీఎఫ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని స్పీకర్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## దత్తత జిల్లాలో అభివృద్ధి చేయండి

**- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

నేరడిగొండ, డిసెంబర్ 4, ప్రభాతవార్త:

ప్రభుత్వం ఏర్పడి సుమారుగా రెండు సంవత్సరాలు కావస్తున్న జిల్లాను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దత్తత తీసుకున్నట్లు ప్రకటించిన అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ విమర్శించారు. గురువారం మండలంలోని బుద్ధికొండ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో తన నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికై ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. పార్టీలో చేరిన నాయకులు కళ్లెం నరోత్తం రెడ్డి, అన్నెడ్డి లక్ష్మారెడ్డి, నల్ల నరేశ్ రెడ్డి, ఎ లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను కప్పి పుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి ఆదిలాబాద్లో సభ నిర్వహించారని అన్నారు. ఆ సభతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒరిగేది ఏమి లేదన్నారు. జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పర్యటిస్తుండగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీని వీడడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎలేటి రవిందర్రెడ్డి, దేవేందర్రెడ్డి, రవిందర్రెడ్డి, మహేందర్రెడ్డి, లవకుమార్రెడ్డి పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి అండర్ 19 కోకో పోటీలకు మంచిర్యాల విద్యార్థి ఎంపిక

మంచిర్యాల, ప్రభాతవార్త:



రాష్ట్రస్థాయి యెస్ జీ ఎఫ్ అండర్ 19 ఖోఖో పోటీలకు తెలంగాణ ఆదర్శ పాఠశాల రాజీవ్ నగర్ మంచిర్యాల విద్యార్థి తెలంగాణ, జూనియర్ కాలేజ్ మంచిర్యాల్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వై. నందిని రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున ఎంపికైనట్లు కళాశాల ప్రధానోపాధ్యాయుడు బుచ్చన్న తెలిపారు. ఈనెల తేదీ డిసెంబర్ 5 నుంచి 7 తారీఖు వరకు సికింద్రాబాద్‌లోని వెస్లీ జూనియర్ కాలేజ్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంతారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరపున నుంచి మంచి ప్రదర్శన కనబరిచి రాష్ట్రం స్థాయి ఎంపికైన విద్యార్థిని వై. నందినిని మంచిర్యాల్ జిల్లా డిఈఓ అంజయ్య, ఉమ్మడి ఆదిలాబాద్ కళాశాల క్రీడల సమాఖ్య కార్యదర్శి బి బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పిడి ఎన్ సుదీప్, మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా బొక్కల గుట్ట ఆలయంలో రామనవమి వేడుకలు

రామకృష్ణాపూర్, డిసెంబర్ 04, ప్రభాతవార్త



పౌర్ణమి శుభదినాన బొక్కల గుట్ట ఆలయంలో శ్రీరామ, లక్ష్మణ, సీతాదేవి విగ్రహాల ప్రత్యేక అలంకరణతో రామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తుల హృదయాల్లోని ఆధ్యాత్మిక తపస్సును ప్రతిబింబించే విధంగా ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవ ప్రారంభంలో విగ్రహాలపై పుష్పమాలలతో సుసంపూర్ణ అలంకరణ జరిపారు. అనంతరం భక్తులు బొక్కల గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం ద్వారా ఆధ్యాత్మిక శాంతి, దేవరసభావాన్ని సంతరించుకున్నారు. భక్తులు తమ హృదయంలోని ప్రేమ, భక్తి, వినమ్రతను విగ్రహాల ముందు అర్పిస్తూ పవిత్ర అభిషేకాల్లో పాల్గొన్నారు. విగ్రహాలపై మేఘమాల, పంచామృత, గంధపానముల పవిత్ర అభిషేకం జరిగి ఆ ఉత్సవం మరింత పవిత్రతతో నిండిపోయింది. ఆలయ అధికారులు, పూజా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భక్తుల ఆధ్యాత్మిక సహకారం, శ్రద్ధ వలన ఈ ఉత్సవం విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. ఉత్సవం ద్వారా స్థానికులు తమ ఆధ్యాత్మికతను పునరుజ్జీవింపజేసి, భక్తి సంప్రదాయాలను మరింతగా గౌరవించే అవకాశం కలిగినట్లు భక్తులు తెలిపారు.

## బీసీ వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లను అందజేయాలి

లక్షెట్టిపేట, డిసెంబర్ 04, ప్రభాతవార్త




లక్షెట్టిపేట పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లను అందజేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి కోరారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు దుప్పట్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరతగతిన దుప్పట్లను అందించాలని డిమాండ్ చేశారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

## భద్రతా లోపాలతోనే తరచూ ప్రమాదాలు

**- ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ఎస్‌కె బాజీ సైదా**

నస్పూర్, డిసెంబర్ 4, ప్రభాతవార్త

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె 7 గనిలో రక్షణ చర్యలు కరువయ్యాయని, అధికారుల నిరక్ష్యం కారణంగానే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్‌కె బాజీ సైదా ఆరోపించారు. గురువారం వారు ఆర్.కె 7 గనిని సందర్శించి, కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గనిలో రక్షణ అధికారి నిరక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు జరిగిన ప్రమాదంలో ఎస్‌డిఎల్ బండి కేబుల్ తాకి శ్రీనివాస్ అనే కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ఒకే లెవల్‌లో రెండు ఎస్‌డిఎల్ యంత్రాలు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఇది పూర్తిగా యాజమాన్య వైఫల్యమని మండిపడ్డారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి, గనిలో రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ అవసరాల నిమిత్తం అండర్ గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్‌పై విధుల్లో వాడుకుంటూ, ఇప్పుడు వారి అండర్ గ్రౌండ్ అలవెన్సులను రికవరీ చేయడం దారుణమని అన్నారు. కార్మికుల వేతనాల నుంచి చేస్తున్న రికవరీలు వెంటనే ఆపాలని, లేనిపక్షంలో యాజమాన్యంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కొట్టె కిషన్ రావు, ఏరియా సెక్రటరీ సంపత్, పిట్ సెక్రటరీ మారేపల్లి సారయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సదానందం, నాయకులు శంకర్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన ఉద్యోగికి ఆర్థిక సహాయం

రామకృష్ణాపూర్, ప్రభాతవార్త



రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్‌లో పారిశుద్ధ సేవలు అందిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగి రాకేష్ తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనపై హాస్పిటల్ సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. రాకేష్ చికిత్స, కుటుంబ అవసరాల దృష్ట్యా మొత్తం రూ. 52,200 విరాళాన్ని హాస్పిటల్‌లోని డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, వార్డ్ అసిస్టెంట్లు, ఆయాలు, కార్యాలయ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి సమీకరించారు. ఈ విరాళాల్లో రూ. 27,200 మొత్తాన్ని డివై సీఎంవో అడ్మిన్ ఎం. మధు కుమార్ చేతుల మీదుగా రాకేష్ కుటుంబానికి అందజేశారు. మిగిలిన రూ. 25,000 మొత్తాన్ని కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని వచ్చే నెలలో రెండో దఫాగా అందజేయనున్నట్లు తెలిపారు. డివై సీఎంవో మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో ముందుండడమే కాకుండా, పేషంట్ కేర్‌లోనూ ఏరియా హాస్పిటల్ సిబ్బంది అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు అందరికీ ఆదర్శం అని అభినందించారు. ఈ కార్యక్రమం మేకల రాజయ్య, నాగేంద్రబట్టుల వారి సహకారంతో నిర్వహించబడింది. కార్యక్రమంలో మాట్రన్ విజయలక్ష్మి, ఆఫీసు సూపరిండెంట్ కృష్ణమూర్తి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎండి మదర్ సాహెబ్, అలాగే అనేక మంది డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, వార్డ్ అసిస్టెంట్లు, ఆయాలు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## గౌతమేశ్వర ఆలయంలో ఘనంగా సత్యనారాయణ వ్రతాలు

మంచిర్యాల, డిసెంబర్ 4, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున గల ప్రసిద్ధ చారిత్రక ఆలయాలలో ఒకటైన గౌతమేశ్వరాలయంలో గురువారం సత్యనారాయణ వ్రతాలు పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గోదావరి నది ఒడ్డున వెలసిన ఈ పురాతన శివాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గౌతమ మహర్షి ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెప్పే గౌతమేశ్వర లింగంతో పాటు పార్వతీదేవి, నందీశ్వరుడు, వినాయకుడు కొలువై ఉన్న ఈ ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడం భక్తులకు ఎంతో పుణ్యఫలదాయకంగా భావిస్తారు. గురువారం రోజు కూడా 21 జంటలు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వుత్తూరి దివ్య రవీందర్‌ల దంపతుల కూతురు శాన్విత జన్మదినము సందర్భంగా అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. వందలాది మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పూర్ణిమ, ఏకాదశి వంటి పవిత్ర దినాల్లో ఇలాంటి వ్రతాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం వల్ల ఆలయ ప్రాంగణం భక్తిప్రపూరిత వాతావరణంతో నిండిపోయింది.